# భార్య

కోరుకొండ సత్యానంద్



రాంబాబు ఆలోచిస్తున్నాడు అలా చాలా సేపటి నుండి ఆలోచిస్తున్నాడు

ప్రక్కగదిలో మంచాన పడి ఉన్న తల్లి మూలుగు, అదే గదిలో చెల్లెలు సుగుణ నెమ్మదిగా తీస్తున్న కూనిరాగం, వరండాలో గణగణమని పాఠాన్ని వల్లెవేస్తున్న తమ్ముడు రాజా కంఠం, తను పడుకొని ఉన్న మంచం ప్రక్కనే బుద్ధిగా కూర్చొని పలక మీద అక్షరాల్ని దిద్దుతూ చదువుతున్న ఒక్కగానొక్క చిన్నారి కొడుకు బుజ్జి ముద్దు కంఠం వంట గదిలో భార్య సుజాత పని చేస్తుండడం వలన వస్తున్న పాత్రల శబ్దం అన్నింటినీ వింటూ, దండవేసి ఉన్న తండ్రి ఫోటోవైపు చూస్తూ అదే పనిగా ఆలోచిస్తున్నాడు రాంబాబు

గుమాస్తా గిరీ చేస్తున్న మధ్యతరగతి రాంబాబు ఎప్పుడూ ఆలోచించేది వాళ్ళందరి గురించే ఇప్పుడు ఆలోచిస్తున్నదీ వాళ్ళందరి గురించే!

ఆలోచనల తాకిడి తట్టుకోలేకపోతున్నా, ఆ ఆలోచనలను కట్టి ఓ ప్రక్కన పడేయలేక పోతున్నాడు రాంబాబు

డబ్బు లేకపోయినా, చేతిలో ఉన్న డబ్బు ఎదురుగా కన్పిస్తున్న ఖర్చులకు సరిపడకపోయినా మధ్యతరగతి మనిషి మెదడు ఆగని ఆలోచనలకు ఆహారమివ్వక మానదు

ఇప్పుడు రాంబాబు చేతిలోకి రాబోతున్నది అయిదొందలు ఆ అయిదొందలూ వస్తాయని తెలిసిన మరుక్షణం నుండీ ఎదురైన ఖర్చుల జాబితా రాంబాబును వెక్కిరిస్తూనే ఉంది ఆ జాబితాలోని ఏఖర్చునూ రాంబాబు కొట్టేయలేదు ఆ ఖర్చుకు కారణమైన వారినెవ్వరినీ కాదనలేదు

అందుకే అతనిని ఆలోచనలు ఆటపట్టిస్తున్నాయి

గడియారం పదిగంటలు కొట్టింది

తల్లి నిద్రలోకి జారిందేమో మూలుగు కాస్త తగ్గుముఖం పట్టింది చెల్లెలు కూడా

# భార్య

నిద్ర పోయిందేమో ఏ కూనిరాగమూ విన్పించడం లేదు

తల త్రిప్పి క్రిందకు కొద్దిగా వంగి చూసాడు  బుజ్జి అక్కడే చాపమీద పడుకుండి పోయాడు  లేచి వాడ్ని మంచం మీద వేసు కుందామనుకున్నాడు గానీ ఆవహించిన అసహనం అతడినా పని చేయనివ్వలేదు

అంతలో వంట గదిలో లైటు ఆర్పు తున్నట్టు, మరుక్షణంలో వంటగది తలుపు గెడ వేస్తున్నట్టు విన్పించింది

'అంటే సుజాత పని అయిపోయిందన్న మాట!'' అనుకొని సుజాత రాకకోసం ఎదురు చూడసాగేడు

ఒక నిమిషం గడిచాక సుజాత పైట కొంగుతో చేయి తుడుచుకొంటూ ఆ గదిలోకి వచ్చి రాంబాబు పడుకొని ఉన్న మంచం క్రింద నున్న చిన్న పట్టె మంచాన్ని లాగి, దాని మీద ప్రక్కవేసి బుజ్జిని పడుకోబెట్టి రాంబాబు కాళ్ళ దగ్గర కూర్చుంటూ ''కాళ్ళు రాయమంటారా?'' అని అడిగింది

''వద్దులే!'' అని కాళ్ళను కొద్దిగా ముడుచుకున్నాడు

''అలా ఉన్నారేం?''

''ఏం లేదు  ''

''తలనొప్పిగా ఉందా?''రాయమంటారా?''

''వద్దు  ''

కాసేపు వాళ్ళిద్దరిమధ్యా నిశ్శబ్దం నిట్టూర్చింది

ఒక నిమిషం తర్వాత రాంబాబే అన్నాడు ''నీకు తెలుసా? రేపు మా ఆఫీసులో అందరికీ బోనసులు ఇస్తున్నారు''

''తెలుసు  ''

''అమ్మ తప్ప పండక్కి అందరూ అన్నీ అడిగారు  మరి నువ్వేమీ అడగలేదేం?''

''ఏమేమి అడిగారేమిటి?''

* * *

ఆఫీసునుండి వచ్చిన రాంబాబు కాళ్ళు కడుగుతుండగా సుగుణ చేత్తో టవల్ తో అక్కడకు వెళ్ళి ''అన్నయ్యా! మీకు బోనస్ ఇస్తున్నారట  పండక్కి నాకేం కొంటావు?'' అని అడిగింది నవ్వుతూ –

చెల్లెలు చేతిలోంచి టవల్ తీసుకొంటూ ''అప్పుడే ఆ వార్త నీ దగ్గరక్కూడా వచ్చేసిం దామ్మా?'' అని అడిగాడు రాంబాబు

''మన ప్రక్కింటి ఆంటీ చెప్పింది ఆ అంకుల్ కూడా మీ ఆఫీసే కదా!?''

''అవునమ్మా! పండక్కి నీకేం కావాలో చెప్పు  కొంటాను''

''ప్రతీసారి లాగే అన్నయ్యా! అయితే ఈసారి లంగా, వోణీ రెండూ డిస్కోవే కొనాలి మన వీధి చివర రాధలేదూ, అది నిన్ననే కొనుక్కుంది  నూట యాభై అయితే సరిపోతుంది! జాకెట్టుగుడ్డ ఒకటి నా దగ్గ రుందిలే! ఒకవేళ నువ్విచ్చినదాంట్లో మిగిల్తే జాకెట్టుగుడ్డ కొనుక్కుంటాను''

''అలాగేనమ్మా! నీకు నచ్చినవే కొనుక్కో! రేపు సాయంత్రం డబ్బులిస్తాను''

''థాంక్స్ అన్నయ్యా! కాఫీ తెస్తానుండు'' అని వంటగదిలోకి వెళ్ళింది

రాంబాబు కాఫీ త్రాగుతుండగా రాజు వచ్చాడు

''అన్నయ్యా! పండక్కి అక్కతోపాటూ నాకూ ఓ డ్రస్ తియ్యన్నయ్యా!''అని అడిగాడు

''క్రిందటి నెలే కదరా నీకో మంచి జత బట్టలు కొన్నాను  వాటినింకా కుట్టించుకో లేదుకదా, మళ్ళీ ఇప్పుడెందుకు బట్టలు?''

''అవి తర్వాత నా బర్త్ డేకి కుట్టించు కొంటానుగానీ ఈ పండక్కి నాకు 'డిస్కో కింగ్' ప్యాంటు కావాలన్నయ్యా! కొనిపెట్టవూ? షర్టు క్రొత్తది అక్కర్లేదులే ప్యాంటు ఒక్కటే చాలు  ''

రాంబాబుకి క్రిందటి నెల డి ఎ ఎరియర్స్ ఓ రెండు వందల రూపాయలు వచ్చింది  పండక్కి ఒక్కసారే అందరికీ తీయడం వీలవ్వదని, స్కూలుకి వెళ్ళేవాడని రాజుకి ఓ జత బట్టలు తీసి, షాపువాడు చవగ్గా వస్తుందని చెప్పి చూపించిన ఓ షర్టింగ్ కట్ పీస్‌ను తనకోసమని తీసుకునేసరికి ఆ రెండు వందలూ అయి పోయాయి  ఆ తర్వాత రాజు బట్టలకి కుట్టు కూలి ఇవ్వడానికి కుదరనూలేదు, ఒకవేళ కుట్టించినా పండక్కిముందే తొడిగేస్తాడని రాంబాబు కుట్టించడానికి ప్రయత్నించలేదు

''ఏమన్నయ్యా ఏమీ మాట్లాడడంలేదు? మా క్లాస్‌మేట్స్ అందరూ 'డిస్కో కింగ్' ప్యాంట్లు కొనుక్కున్నారు  ఒక వందరూపాయలే అన్నయ్యా! ఇవ్వవూ?''

తమ్ముడు అలా అడుగుతుంటే కాదనలేక పోయాడు రాంబాబు

''అలాగేలే! నువ్వెళ్ళి చదువుకో ''  అన్నాడు

''థాంక్స్ అన్నయ్యా!'' అని రాజు అక్కడ నుండి వెళ్ళిపోయాడు

రాజు పట్టిన పట్టు వదలడు  రాజుని చూస్తున్నప్పుడు తండ్రి గుర్తుకు రావడంతో రాజుని ఏమీ అనలేదు రాంబాబు

కాఫీ త్రాగేసి గ్లాసు అక్కడ పెట్టి ప్రక్కకు తిరిగి చూసేంతలో అక్కడున్న స్తంభానికి అందంగా ఆనుకొని తన వైపే చూస్తూ చూస్తూ ముద్దుగా నవ్వుతూ కన్పించాడు బుజ్జి


రాంబాబు అక్కడి నుండి ఒక్క అంగలో ఆ స్తంభం దగ్గరకు వెళ్ళి బుజ్జిని ఎత్తుకొని ''అడ్ డడ్డడ్డడ్డే బుజ్జిబాబూ! ఏంటి నాన్నా అలా చూస్తున్నావ్?'' అని రెండు బుగ్గల మీదా రెండు ముద్దులు పెట్టాడు రాంబాబు


''నాన్న! పండక్కి నాకూ కొనవా బట్టలు?''


పదాన్ని పదాన్ని విరిచి ముద్దు ముద్దుగా అడిగిన కొడుకు మాటలకు ఎంతగానో మురిసి పోయాడు రాంబాబు


''ఎందుకు కొనన్రా! నీక్కాపోతే ఇంకెవరికి కొంటాను నాన్నా, ఈసారి పండక్కి నీకు మంచి బట్టలు కొంటానే సరేనా? మరి ఇక్కడ ముద్దు పెట్టు'' అని బుగ్గ చూపించాడు రాంబాబు

బుజ్జి కిలకిలా నవ్వుతూ ముద్దుగా ముద్దు పెట్టాడు





''నువ్వెళ్లి ఆడుకోమ్మా!'' అని బుజ్జిని దించేసి రాంబాబు గదిలోకి వెళ్ళి, బట్టలు విప్పేసి లుంగీ కట్టుకుని వాలుకుర్చీలో జొరబడ్డాడు

* * *

''అలా అందరూ అన్నీ అడిగారు కదా, నువ్వూ అడుగు నీకేం కావాలో!'' అదోమాదిరిగా అన్నాడు రాంబాబు

''అడగమంటారా?''

భార్య ముఖంవైపు పరిశీలనగా చూసాడు రాంబాబు సుజాత మాత్రం మామూలుగానే చూసింది భర్త వైపు

''అలస్యం దేనికి? అడుగు''

''నాకేం కావాలో అడిగేముందు నేనడిగింది కొనేందుకు మీ బోనస్‌లో నాకెంత కేటాయించ గలరో చెప్పండి!''

''నువ్వడిగిందాని ఖరీదంత!''

''అలా అయితే మిగిలిన వాళ్లందరూ అడిగినవి కొనలేరేమో కదా మీరు వాళ్లకేం సమాధానం చెప్తారు?''

''అందరూ అడిగినవి కొనగలను నేను''

''ఎలా?'' ఆసక్తిగా అడిగింది సుజాత

''ఏముంది? అప్పుచేసి!'' చిన్నగా నవ్వుతూ అన్నాడు రాంబాబు ఆ నవ్వులోని విరక్తిని గమనించక పోలేదు సుజాత

''అప్పు చేయడం ఎందుకండి?''

''ఏమిటే సుజాతా నీ ప్రశ్నలు—కావాల్సిందేదో అడగ్గూడదూ!?'' కొద్దిగా చిరాకు కన్పించింది రాంబాబు కంఠంలో

''భార్య స్థానంలో ఉన్న ఆడది భర్తని ఏదైనా అడిగేముందు ఆలోచించాలి అడగడానికి అవకాశం ఉంటేనే అడగాలి లేకపోతే ఆ అవకాశాన్ని అందుకొనే మార్గాన్ని ఆలోచించాలి నేనన్నది మీరు కాదంటారా?''

''నువ్వన్నది నేనెప్పుడు కాదన్నాను సుజాతా? నువ్వు చెప్పింది నాకర్థమైంది ఆ మార్గం ఏమిటో ఆలోచించావా?''

''ఆఁ'' తల వంచుకొని నెమ్మదిగా అన్నది సుజాత

''ఏమిటది?''

''మీరేమీ అనుకోనంటే చెప్తాను''

''నేనేమనుకుంటాను సుజాతా? చెప్పు నువ్వేం చెప్పినా నేనేమీ అనుకోను, కాదనను కూడా!''

''ఏం లేదండి అత్తయ్యగారికి మందులు కొనడం, వైద్యం చేయించడం అన్నది అనవసరం అని ఎవ్వరూ అనరు కానీ, మీ చెల్లెలికి డిస్కో వోణీ, లంగా, జాకెట్టు మీ తమ్ముడికి ఇప్పుడా డిస్కోకింగ్ ప్యాంటు కొనడం అనవసరం అని నా అభిప్రాయం

అంత వరకూ ఎటో చూస్తూ ఆలకిస్తున్న రాంబాబు సుజాత చెప్పడం ఆపడంతో ఆమె వైపు ఒక్క క్షణం చూసి ''ఊఁ చెప్పు వాళ్ళకవి కొనడం మానేసి నీకేం కొనమంటావో చెప్పు అలాగే చేస్తాను'' అని అన్నాడు

సుజాత భర్తవైపు కంగారుగా చూసి ''నేను చెప్పేది పూర్తిగా వినండీ పెళ్ళికాబోయే పిల్లకదా, ఇప్పుడు లంగా వోణీలు కొనుక్కునే కంటే ఒక మంచి చీర కొనుక్కుంటే మంచిది లంగా వోణీల బదులు చీర కొనుక్కోవడంలో ఓ యాభై రూపాయలు మిగుల్తాయి కూడా! ఇకపోతే, రాజుకి క్రిందటి నెల్లోనే కదా ఖరీదైనవి ఓ జత బట్టలు కొన్నారు మళ్ళీ ఈ ప్యాంటు దేనికి? ఆ బట్టల్ని కుట్టించుకోవనండి పండక్కి కుట్టు కూలి ఇచ్చేదురు గాని'' అని ఆగి భర్త వైపు చూసింది సుజాత

''నువ్వాలోచించిన మార్గం చాలా బాగుంది సుజాతా! ఊఁ ఆపేసావేం? చెప్పు, నేను మిగిలించాల్సినవి ఇంకా ఏమైనా ఉన్నాయా?''

''ఇంకా ఎందులో మిగులుస్తారు?''

''మన బుజ్జి బట్టల్లో ఇంకా మా అమ్మ మందుల బాకీలో''

''ఎందుకండీ అంత నిష్ఠూరంగా మాట్లాడతారు? నేనన్నదాంట్లో తప్పేమన్నా ఉంటే ముఖంమీద చెప్పేయండి గానీ, అలా అనకండి ఒక్కగానొక్క కొడుక్కి కొంటానంటే నేను వద్దంటానా? మీ అమ్మగారికి మందులు కొనద్దు, వైద్యం చేయించొద్దని నేనెప్పుడైనా అన్నానా? నేనెప్పుడు ఎవరికి ఏం చూడొద్దన్నానో చెప్పండి ఏదో మనసుపడి, ఆడదాన్నైనందుకు ఆశపడి, బోనస్ డబ్బులో పండక్కి సరదాగా ఏమైనా కొనుక్కుందామని ఇలా అంటున్నాను గానీ, వాళ్ళందరికీ ఏమీ కొనకుండా అంత డబ్బుతోనూ నాకే కొనెయ్యమని అనడం లేదుగా?'' ఏడుపు పర్యంతం అయ్యింది సుజాత

''ఇంక ఊరుకో సుజాతా! నువ్వు చెప్పినట్టే చేస్తానుగానీ ఇంక ఆ ఏడుపు ఆపెయ్! విసుగొస్తుంది అందరూ నన్ను సాధించేవాళ్ళే! నా బాధల్ని, కష్టాల్ని కనిపెట్టి మాట్లాడేవాళ్ళు ఒక్కరు ఒక్కరుకూడా లేరు అందరూ అన్నీ కావాలని అడగడానికి నేనున్నానుగానీ, నాకెవరున్నారు నాక్కావలసినవి చూడ్డానికి? ఛ ఛ! మగవాడికి మధ్యతరగతి కుటుంబంలో పెద్దవాడిగా పుట్టడం అంత దురదృష్టం మరొకటి లేదు''

సుజాత ఏడుపు ఆపేసింది

రాంబాబు ప్రక్కకు తిరిగి పడుకున్నాడే గానీ అతడిని ఆలోచనలు వెంటాడడం మానలేదు

ఇందాక సాయంత్రం గదిలో వాలు కుర్చీలో కూర్చొని పేపరు చదువుతుండగా సుజాత వచ్చింది

''కాఫీ త్రాగేరా, ఇందాక సుగుణ చేత పంపించేను'' అని అడిగింది

''ఆఁ త్రాగేను మా అమ్మకెలా ఉంది?''

''సుగుణ, రాజూ వీళ్ళెవ్వరూ చెప్పలేదా?''

''ఏమిటి?'' కొంచెం కంగారుగా అడిగాడు రాంబాబు

''ఇందాక అత్తయ్యకు కాస్త గాభరా చేసింది రిక్షామీద తీసుకెళ్ళాను చాలా మందులు రాసారు మందులు మాత్రం క్రమం

తప్పకుండా వాడమన్నారు మందులు వాడ్డం మానేయడం వల్ల అలా జరిగిందట

రాంబాబు గబగబా అక్కడినుండి తల్లి ఉన్నగదిలోకి వెళ్ళాడు

తల్లి నీరసంగా పడుకొని ఉంది చిన్నగా, నీరసంగా మూలుగుతుంది

"అమ్మా!" అని లేపబోయాడు

"వద్దు లేపకండి ఇప్పుడే పడుకున్నట్టున్నారు"

"ఆ మందులు చీటీ ఇలా ఇయ్యి తెస్తాను"

"అక్కర్లేదు లెండి ఇందాక నేను తెచ్చాను"

"డబ్బు లెక్కడివి?"

"మన ఖాతా మందుల షాపులో తెచ్చాను పాత బాకీతో కలిపి సరిగ్గా రెండువందల రూపాయలు అయ్యింది మీ బోనస్‌లకు ఎలాగైనా ఇచ్చేయమని చెప్పాడు" అంది సుజాత

రాంబాబు మౌనంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు

అప్పటినుండీ భోజనం కోసం రెండుసార్లు పిలిచేవరకూ తనలో తను ఏదో అలా అనుకుంటూనే ఉన్నాడు భోజనం అయ్యాక కూడా అతడిని ఆ ఆలోచనలు విడువలేదు

ఇప్పుడు భార్య మాటలు విన్నాక ఆ ఆలోచనల స్థానంలో కొద్దిగా బాధ, ఆదో రకమైన గుండె బరువు మొదలయ్యాయి

అందరూ అన్నీ అడిగారు ఆ అడిగిన వాళ్ళు చిన్నవాళ్ళు బాధ్యతలు, బాధలు తెలియనివాళ్ళు కానీ, సుజాత చిన్నపిల్లకాదే? భార్య స్థానంలో ఉండి భర్తకు వీలైనంత సౌకర్యాన్ని కలిగించి ఉన్నంతలో సరిపెట్టుకోవాలిగానీ తనకూ ఏదో కావాలని అందరిలా తనుకూడా వేధిస్తుంది ఏమైనా అంటే ఏడుస్తుంది

వాళ్ళడిగినవి కొనకపోతే పెద్దవాళ్ళంగా వాళ్ళను మేం ఏం చూస్తున్నట్టు? అడిగింది కాదని, అనగనిదాన్ని కొనిపెట్టి ఖర్చు తగ్గించేది ఎవరి కోసం? తనకోసం తనకు కావాల్సినవి కొనుక్కోవడం కోసం

ఎటొచ్చీ ఏవీ అక్కర్లేనివాడిని నేనేకదా!? అన్ని ఆశల్నీ సంసారం కోసం చంపేసుకొంటున్నది నేనే కదా!?

ఏమో!?

అందిన డబ్బుని సుజాత చేతిలోనే పెట్టేస్తాను అందరికీ ఆవిడే సమాధానం చెప్పుకొని, అన్నీ ఆవిడే కొంటుంది ఎవరైనా ఏమైనా అన్నా, అడిగినా ఆవిడ్నే అడగమని చెప్పేస్తాను

కొంతసేపు ఆలోచనలు అలా సాగిపోయాక రాంబాబు నిద్రలోకి జారిపోయాడు

*　　　*　　　*

# భార్య

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన రాంబాబు ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా— తన గదిలోకి వెళ్ళిపోయాడు

భర్త రావడం చూసి సుజాత మంచినీళ్ళ గ్లాసుతో ఆ గదిలోకి వెళ్ళింది

"మంచినీళ్ళు తీసుకోండి"

రాంబాబు భార్య ముఖంవైపు చూడకుండా మంచినీళ్ళ గ్లాసును అందుకుంటూ "ఆ అయిదొందలూ రేడియో దగ్గర పెట్టాను ఏం చేస్తావో, ఎలా చేస్తావో, ఎవరికి ఎలా సరిపెడతావో నువ్వే చెయ్యి" అన్నాడు

"ఎందుకండీ అంత సీరియస్‌గా మాట్లాడతారు? ఆ డబ్బు ఖర్చుపెట్టి లెక్క చెప్తాను, బిల్లుల్ని కూడా చూపిస్తాను"

"నేనవన్నీ ఏవీ అడగడంలేదు కాస్త రెస్ట్ తీసుకోనియ్, నువ్వు బయటకు వెళ్ళు" కోపాన్ని, బాధను అణచుకుంటున్నట్టుగా అన్నాడు

సుజాత బయటకు వెళ్ళబోయేంతలో "చెప్పానుగా, ఆ డబ్బు తీసుకొని వెళ్ళు" అన్నాడు విసుగ్గా

ఒక్క క్షణం భర్తవైపు చూసి ఆ డబ్బును తీసుకొని బయటకు వెళ్ళిపోయింది సుజాత

*　　　*　　　*

రాంబాబు సుజాత అందించిన కాగితం వైపు చూసాడు పేపర్లోంచి

"ఏమిటి?"

"మీరు నిన్న నాకు అయిదొందలు ఇచ్చారుగా! అందరికీ అన్నీకొన్నాను ఆ వివరాలు ఇవిగో బిల్లులు"

"నేనివన్నీ అడుగలేదుగా?" అని మళ్ళా పేపరు చదవడం మొదలుపెట్టాడు

"అడక్కపోయినా లెక్క చెప్పాల్సిన బాధ్యత నాకుంది మందుల షాపుకి రెండొందలు కట్టేసాను మీ చెల్లెలు బట్టలకి సరిగ్గా వంద రూపాయలయ్యింది బాబుకి యాభై రూపాయలు పెట్టి రెడీమేడ్ జత ఒకటి కొన్నాను చూడండి" అని బీరువాలోంచి బట్టల్ని తీసిమంచం మీద పెట్టింది

రాంబాబు ఒక్కనిమిషం తర్వాత పేపరు పక్కన పెట్టి ఆ బట్టల్ని చూసాడు

"బాగున్నాయా?"

"వేసుకొనేది నేను కాదు కదా!? వాళ్ళకి నచ్చాయా?"

"సుగుణను, తీసుకొని వెళ్ళే కొన్నానివి బాబు బట్టలు మీకు నచ్చాయా?"

"ఆఁ బాగానే ఉన్నాయి"

"మీ తమ్ముడికి కుట్టుకూలి కని నలభై రూపాయలు ఇచ్చాను మీకు నచ్చచెప్పడం రాదుగానీ, చెప్పే విధంగా చెప్తే వాళ్ళూ అర్థం చేసుకొనేవాళ్ళే!"

"ఎలాగోలా జరిగింది కదా ఇక ఊరుకో!" అని మంచం మీద వెల్లకిలా పడుకొన్నాడు

సుజాత పాత టవల్ తీసుకొని ఫ్యానును తుడవడం మొదలు పెట్టింది ఏమీ మాట్లాడకుండా

కొంతసేపయ్యాక "అందరికి కొన్నవి, ఖర్చుపెట్టినవీ చెప్పావ్, చూపించావ్! నువ్వేం కొనుక్కున్నావో చెప్పలేదేం?"

"నేనింకా కొనుక్కోలేదు"

"ఏం?"

"ఇవి కొనేసరికే చాలా టైమయ్యింది, విసుగెత్తింది రేపు నేనొక్కదాన్నే వెళ్ళి తీరుబడిగా సెలక్ట్ చేసుకొని కొనుక్కుంటాను" అని ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది

సుజాత ఆ మాట అన్న తీరుకు, అలా నిర్లక్ష్యంగా వెళ్ళిపోయినందుకు రాంబాబుకు చాలా చిరాకేసింది భార్య మీద గొంతు దాకా కోపం వచ్చింది

కోపంగా గోడ వైపుకు తిరిగి పడుకుండిపోయాడు

*　　　*　　　*

రాత్రి తొమ్మిది గంటలయ్యింది

రాంబాబు ఆఫీసు ఫైళ్ళు ముందేసుకొని కూర్చున్నాడు సుజాత ఏదోపత్రిక తిరగేస్తుంది

రాంబాబు ఏదో వ్రాసుకుంటున్నాడేగానీ ఓ కంట సుజాతను కనిపెడుతూనే ఉన్నాడు సుజాత కూడా పత్రిక తిరగేస్తుందేగానీ భర్తను గమనిస్తూనే ఉంది

రాంబాబుకి చాలా ఉక్రోషంగా ఉంది నిన్నటి రాత్రి నుండీ

ఇంటి కొచ్చాక కనీసం తనేం కొనుక్కున్నదీ మాట వరసకైనా చెప్పలేదు నేనేమైనా అనుకుంటానేమోనని కూడా చూపించలేదు ఈ ఆడవాళ్ళ మనస్తత్వమే ఇంత గడుసుగా ఉంటే ఏడుస్తారు, మెత్తగా ఉంటే మొండిగా తయారౌతారు అని ఏవేవో అనుకుంటున్నాడు

మరో పావుగంట అలాగే గడిచింది

రాంబాబు ఫైళ్ళన్నీ సర్దేసి భార్యవైపు చూసాడు సుజాత భర్తను గమనించనట్లుగా పత్రిక చదువుతున్నట్లు ఉండిపోయింది

రాంబాబు ఇంక ఊరుకోలేకపోయాడు

"ఒక్కదానివే వెళ్ళి తీరుబడిగా, స్పెషల్‌గా సెలక్ట్ చేసుకొని ఏదో కొనుక్కుంటానన్నావ్ కొనుక్కున్నావా?"

"ఆఁ మధ్యాహ్నం వెళ్ళి కొనుక్కున్నాను, చూపించమంటారా?"

"చూపించకపోయినా ఫర్వాలేదు"

సుజాత పత్రికను ప్రక్కను పడేసి, రాంబాబుకు దగ్గరగా వెళ్ళింది రాంబాబు ముఖం కందగడ్డలా ఉంది

"సాయంత్రం అనగా ఆఫీసు నుండి వచ్చి

నాతో ఏమీ మాట్లాడలేదు శ్రీవారు ఈ మాట్లాడే మాటలుకూడా అంత కోపంగా మాట్లాడ్డం ఎందుకో !? ఏం, నామీద అంత కోపంగా ఉందా ?'' అంటూ మెడచుట్టూ చేతులు వేసి భర్తను పెనవేసుకుంది

''కోపంగా ఉండదా మరి ?''

''ఉంటుంది మరి అయితే మాత్రం, నువ్వేం కొనుక్కున్నావ్, ఏదీ ఇలా చూపించు అని అడగొచ్చుగా ?''

సుజాత ఆ మాట అనే తీరు, అలా అంటున్నప్పుడు ఆమె అభినయం చూడముచ్చటగా ఉండడంతో రాంబాబు కొంచెం చల్లబడ్డాడు

''నేనడక్కుండా నువ్వు చూపించగూడదా!? ఇంతకూ ఏం కొనుక్కున్నావ్ ?'' రాంబాబు కూడా సుజాత నడుమును చుట్టేసాడు

''చీర చూపించమంటారా ?''

''చూపించమనేకదా నేనడుగుతుంది ?''

''మరి వదలండి ''

సుజాత నడుమును చుట్టుకొని ఉన్న చేతులు సుతారంగా ఆమెను విడిచిపెట్టాయి

సుజాత బీరువా తెరచి అందులోని ఒక ప్యాక్‌ను తీసింది రాంబాబు అప్పటికే ఆమె వెనక్కి వచ్చేసాడు

''విప్పి మీరే చూడండి '' అని ప్యాక్‌ను రాంబాబుకు అందించింది

రాంబాబు ప్యాక్‌ను అందుకొని విప్పి చూసి ఆశ్చర్యపోయాడు భర్తవైపు ఏమిటన్నట్లుగా చూసాడు

సుజాత తల వంచుకుంది

''ఏమిటి సుజాత ఇది ?''

''మీ కోసమే ! క్రిందటి నెల ఎరియర్స్ వచ్చినప్పుడు ఓ షర్ట్ పీస్ కొనుక్కున్నారు కదా మీరు దానిమీదకు బాగా మాచ్ అవుతుందని ఈ ప్యాంట్ పీస్ కొన్నాను పండక్కి మీకు క్రొత్త బట్టల్లేవుగా ?''

రాంబాబు నోటి వెంట మాటలు రావడం లేదు

అతికష్టంమీద 'సుజాత' అని మాత్రం అనగలిగేడు

''పదిసార్లు బేరమాడితే మాట అయిదు రూపాయలకిచ్చాడు ఇంకా అయిదు మిగిలాయి ''

''నీ కోసం ఏదో కొనుక్కుంటావను కున్నాను నా కెందుకు సుజాతా ఇప్పుడిది ?'',

''ఆఫీసుకెళ్ళేవారు, కష్టపడేవారు, పదిమందిలో తిరిగేవారు మీరు నాకున్న చీరలు ఇప్పటికి సరిపోతాయిలెండి అయినా నా కోసం నేనూ కొనుక్కున్నానుగా మిగిలిన అయిదు రూపాయలు పెట్టి ''

''అయిదు రూపాయలు పెట్టికొనుక్కున్నావా ? అయిదు రూపాయలకు ఏమొస్తుంది సుజాతా ?''




''చాలా వచ్చాయి ఏమిటేమిటో చెప్పమంటారా ?''

''చెప్పు ''

''డజను గాజులు, కుంకుమ భరిణె, పెద్ద మల్లెపూల దండ '' అంటూ ప్యాక్‌ను బీరువాలో పెట్టేసింది

''సుజాతా ! నువ్వెంత మంచిదానివి సుజాతా ? నీలాంటి భార్య దొరకడం నిజంగా నా అదృష్టం '' అని సుజాతను గుండెలకు హత్తుకున్నాడు

''అబ్బ ఊరుకోండి, తెగపొగిడేస్తున్నారు ''

''దీన్ని పొగడ్డం అనరు ప్రేమించడం అంటారు ''

సుజాత మొగ్గలా ముడుచుకుపోయింది

రాంబాబును మల్లెపూల వాసన మత్తెక్కించింది ★